


నేడు తిరుపతికి సీఎం



తిరుపతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా మూడో శనివారం జరిగే 'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈసారి సీఎం చంద్రబాబు తిరుపతికి వస్తున్నారు. ఉదయం 11 గంటలకు రేణిగుంటలోని విమానాశ్రయానికి చేరుకునే ఆయన మొత్తం నాలుగు కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రం 5 గంటలకు తిరుగు ప్రయాణం కానున్నారు. కాగా, తొలుత ఖరారైన షెడ్యూలులో మళ్ళీ మార్పులు జరిగాయి.తిరుపతిలో కార్యక్రమాలు ముగించుకుని ఏర్పేడు సమీపంలోని ఐఐటీకి చేరుకుని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సీఎం ప్రారంభించాల్సి వుంది. అక్కడి నుంచే అనంతపురం హబ్‌నూ వర్చువల్‌గా ప్రారంభించాలి. కానీ, చివరగా సీఎంవో నుంచీ విడుదల చేసిన షెడ్యూలులో ఆ కార్యక్రమాన్ని చేర్చలేదు. దీంతో ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం వాయిదా పడినట్లయింది. సీఎం చంద్రబాబుకు పర్యటనలో పాల్గొనేందుకు.. ఏర్పాట్ల పరిశీలనకు శుక్రవారం సాయంత్రమే రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతి చేరుకున్నారు.

చంద్రబాబు పర్యటన ఇలా...

11.30 గంటలు రేణిగుంట మండలం తూకివాకంలో తిరుపతి కార్పొరేషన్‌కు చెందిన ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ ప్లాంట్ సందర్శన

12.15 గంటలు తిరుపతి కపిలతీర్థంలో కపిలేశ్వరస్వామి దర్శనం.అక్కడే 'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు.

1.15 గంటలు పోలీస్ పరేడ్ మైదానం చేరుకుని భోంచేసి విశ్రాంతి తీసుకుంటారు.

2 - 3.45 గంటలు పోలీస్ పరేడ్ మైదానంలో ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారు.బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో సమావేశమవుతారు.

సాయంత్రం 4 గంటలు అలిపిరి వద్ద ఉన్న కంచి కామకోటి పీఠానికి చెందిన మఠానికి చేరుకుని కంచి స్వాములతో సమావేశమవుతారు. 4.30 గంటలకు తిరుగుప్రయాణమవుతారు.

విషాదంలో డి.అగ్రహారం

ప్రియుడి వేధింపులు తాళలేక నిండు గర్భిణి ఆత్మహత్య



ఇంద్రజ (ఫైల్‌ఫొటో)

కుప్పం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నిండు గర్భిణి ప్రాణాలు తీసింది. ప్రియుడి వేధింపులు తాళలేక, ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందింది. పోలీసులు, మృతురాలి కుటుంబీకుల నుంచి సేకరించిన వివరాలు ఇలా.... కుప్పం మండలం డి.అగ్రహారం గ్రామానికి చెందిన ఇంద్రజ (25)కు తన మేనమామ పెరుమాళ్‌తో 8 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి బుద్ధిమాంద్యం కలిగిన ఆరేళ్ల కొడుకు ఉన్నాడు. పెరుమాళ్ ఉపాధికోసం మూడు నెలల క్రితం మస్కట్ వెళ్లాడు. ఇంద్రజ కొడుకు, అమ్మమ్మ తాతయ్యలతో కలిసి గ్రామంలోనే ఉంటోంది. ఇంటికి పక్కనే ఉన్న శ్రీజ డెయిరీలో పనిచేసే సత్యకుమార్‌తో ఆమెకు అయిన పరిచయం క్రమేణా వివాహేతర సంబంధంగా మారింది. చనిపోయే సమయానికి ఆమె 8 నెలల నిండు గర్భిణి కావడం విషాదం. ఈ నేపథంలో శుక్రవారం ఉదయం మస్కట్‌నుంచి భార్య ఇంద్రజకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. ఈ విషయం కూలి పనులకు వెళ్లివున్న అమ్మానాన్నలైన కృష్ణన్‌కు, కుల్లమ్మకు ఫోన్ ద్వారా చెప్పి పనికి వెళ్లిపోయాడు. పెద్దవాళ్లిద్దరూ ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో ఇంద్రజ చీరతో ఉరివేసుకుని ఉండడం కనిపించింది. ఉదయం ఈ సంఘటన జరుగగా సాయంత్రం దాకా అందరూ మౌనంగా ఉండిపోయారు. చివరకు పక్క గ్రామంనుంచి ఇంద్రజ చెల్లెలి కుటుంబం వచ్చి ఆమె ఫోన్ చెక్ చేయగా, సత్యకుమార్‌కు, ఆమెకు మధ్య సాగిన ఫోన్ సంభాషణ వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాతే ఇంద్రజను సత్యకుమార్ చంపేశాడంటూ సాయంత్రం కుప్పం అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఆమె భర్త పెరుమాళ్ ఫిర్యాదు చేశాడు. అంతేకాక వెంటనే అతడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ ఎదుట ఆమె బంధువర్గాలు ఆందోళన జరిపాయి. నిందితుడిపై తప్పకుండా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ శంకరయ్య హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సత్యకుమార్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణకు దిగారు. ఇంద్రజ ఫోన్ సీజ్ చేసి అందులోని కాల్ డేటా ఆధారంగా ఆమెకు, సత్యకుమార్‌కు శుక్రవారం ఉదయం 6.30 గంటలనుంచి 9 గంటలదాకా సాగిన ఫోన్ సంభాషణతోపాటు వీడియో కాల్ వివరాలు కూడా సేకరించారు. కాగా సత్యకుమార్ మానసికంగా తీవ్రమైన ఒత్తిడి చేయడంవల్లే తట్టుకోలేక ఇంద్రజ గర్భిణి అయివుండి కూడా ఎటూ పాలుపోని స్థితికి చేరుకుని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నదని పోలీసులు భావిస్తున్నారు. సత్యకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు సత్యకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని అర్బన్ సీఐ శంకరయ్య చెప్పారు.



ఆందోళనకారులకు నచ్చజెబుతున్న సీఐ శంకరయ్య

ఆర్ఎస్కేల పరిశీలనలో 'సబ్సిడీ' జాబితా

కిలో మామిడికి రూ.4 చెల్లింపు కోసం కాయలమ్మిన రైతుల వివరాల వెరిఫికేషన్



బంగారుపాళ్యం ర్యాంపుల వద్ద కాయల్ని దింపుతున్న రైతులు

చిత్తూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి):మామిడి రైతులకు సబ్సిడీ అందించేందుకు రాష్ట్రప్రభుత్వం రైతుల జాబితా వెరిఫికేషన్ ప్రక్రియ మొదలుపెట్టింది. ఫ్యాక్టరీల్లో, ర్యాంపుల్లో కాయలమ్మినప్పుడు నమోదు చేసుకున్న రైతుల వివరాల జాబితాలను రైతు సేవా కేంద్రాలకు(ఆర్ఎస్కే) పంపించి ఆ వివరాలను వెరిఫై చేయిస్తున్నారు.తోతాపురి మామిడి కాయలకు ధరల్లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని గ్రహించిన సీఎం చంద్రబాబు సీజన్ ఆరంభంలోనే కిలోకు రూ.4 సబ్సిడీ ప్రకటించారు. ప్రారంభంలో ఫ్యాక్టరీలు కిలోకు రూ.5నుంచి రూ.6 ఇవ్వగా, ర్యాంపులు రూ.3 నుంచి రూ.4 దాకా ఇచ్చాయి. సీజన్ ముగిసే క్రమంలో ఫ్యాక్టరీలు, ర్యాంపులు ప్రస్తుతం రూ.7నుంచీ రూ.8 దాకా ఇస్తున్నాయి. దీనికి ప్రభుత్వం రూ.4 సబ్సిడీని అదనంగా రైతుల ఖాతాలకు నేరుగా జమ చేయనుంది.

● మిగిలింది నాలుగైదు రోజులే..

ఇప్పటివరకు జిల్లాలో 48,588మంది రైతులనుంచి 3.20లక్షల టన్నుల తోతాపురి కాయలను గుజ్జు ఫ్యాక్టరీలు, ర్యాంపులు కొనుగోలు చేశాయి.ఫ్యాక్టరీల్లో 25,958 మంది రైతులు 2,22,700 టన్నుల కాయల్ని, ర్యాంపుల్లో 22,603 మంది రైతులు 95,655 టన్నుల కాయల్ని అమ్ముకున్నారు. ఇవి అధికారులు సబ్సిడీ కోసం నమోదు చేసుకున్న లెక్కలు. ఇక్కడ వేచి చూడలేక పొరుగు రాష్ట్రాల్లోని ర్యాంపుల్లోనూ కొందరు కాయలను అమ్ముకున్నారు. ఇంకా 25 వేల టన్నుల కాయలు చెట్లపైనే ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మరో నాలుగైదు రోజుల్లో తోతాపురి కాయలు కోతలు అయిపోతాయి. ఫ్యాక్టరీలు, ర్యాంపులు కూడా మూసేస్తారు.

● వచ్చే వారంలో ర్యాంపుల జాబితా కూడా..

ఫ్యాక్టరీలకు తోతాపురి కాయలను అమ్మిన 25,958మంది రైతుల వివరాలను ఉద్యానవన శాఖ అధికారులు శుక్రవారం ఆయా రైతుల చిరునామాలున్న రైతు సేవా కేంద్రాలకు పంపించారు. అక్కడి అగ్రికల్చర్/హార్టికల్చర్ అసిస్టెంట్ రైతు పేరు, తండ్రి పేరు, ఆధార్ నెంబరు, బ్యాంకు అకౌంట్ వంటి వివరాలను వెరిఫై చేయనున్నారు. అసలు ఆ రైతుకు మామిడి తోపులున్నాయా? ఫ్యాక్టరీలకు తోలిన కాయలు, ఆయన తోపులోనివేనా? వంటి వివరాలను వెరిఫై చేసి సబ్సిడీ కోసం జాబితాను ఆమోదిస్తారు. ప్రస్తుతానికి ఫ్యాక్టరీల్లో అమ్మిన రైతుల వివరాలను మాత్రమే రైతు సేవా కేంద్రాలకు పంపించగా, నాలుగైదు రోజుల్లో ర్యాంపుల్లో అమ్మిన 22,603 మంది రైతుల జాబితా కూడా పంపించి వెరిఫై చేయనున్నారు.

ఓ రైతుకు రెండెకరాల మామిడి తోపుంటుంది, అయితే ఆయన 25 టన్నుల కాయల్ని జ్యూస్ ఫ్యాక్టరీలకో, ర్యాంపులకో అమ్మి ఉంటారు. అలాంటప్పుడు ఆ రైతు తన కుటుంబ సభ్యుల పేరుతో కూడా మామిడి తోపు ఉన్నట్లు రికార్డులు చూపించి ప్రూవ్ చేసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే సబ్సిడీకి అర్హత సాధిస్తారు. లేకుంటే రెండు ఎకరాలకు 10 టన్నుల దిగుబడే కదా వచ్చేదని అక్కడి సిబ్బంది ప్రశ్నిస్తారు.

మరణంలోనూ వీడని బంధం

భార్య మృతిని తట్టుకోలేక ప్రాణాలొదిలిన భర్త





శివాజినాయుడు, గిరిజమ్మ (ఫైల్ ఫొటోలు)

తవణంపల్లె, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మండలంలోని కొండ్రాజుకాల్వ గ్రామంలో శివాజినాయుడు(80), గిరిజమ్మ(72) దంపతులు ఒకేరోజున మృతి చెందారు. ఇద్దరూ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గిరిజమ్మ అరగొండలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఈ విషయం తెలియడంతో తట్టుకోలేక శివాజినాయుడు కూడా అదేరోజు సాయంత్రం మృతి చెందాడు. వీరికి కొండ్రాజుకాల్వలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు.


మృతి చెందిన జింక

అలిపిరి వద్ద కుక్కల దాడిలో జింక మృతి

తిరుమల, జూలై18(ఆంధ్రజ్యోతి): అలిపిరి చెక్‌పాయింట్ సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున కుక్కల దాడిలో జింక మృతి చెందింది. పొట్ట భాగంలో గాయాలతో మృతి చెంది పడివున్న జింకను చూసి తొలత చిరుత దాడిగా భావించారు. అయితే చిరుత దాడి చేస్తే మెడ భాగాన్ని నోటకరుచుకుని ఆ తర్వాత అడవిలోకి తీసుకెళ్లి తింటుందని, జింక పొట్టపై గాయాన్ని చూస్తే కుక్కలు దాడి చేసినట్టుగా ఉందని అటవీ అధికారులు చెప్పారు. అయినప్పటికీ విజిలెన్స్ అధికారులు భక్తులను అప్రమత్తం చేసి తిరుమలకు పంపారు.

పాత భవనాలు సిద్ధం చేయండి

● అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు


తిరుమల, జూలై18(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పాత భవనాలను తగిన రిపేర్లతో ఉపయోగంలోకి తీసుకురావాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్ భవనాన్ని శుక్రవారం ఉదయం అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఈవో పరిశీలించారు. హెచ్‌వీడీసీ, బాలాజీ నిలయం, తిరుమల మందిరం(ఆంప్రో రెస్ట్ హౌస్) విశ్రాంతి భవనాలను కూడా పరిశీలించారు. సీఈ సత్యనారాయణ, ఈఈ వేణుగోపాల్, డిప్యూటీ ఈవో భాస్కర్, రెవిన్యూ డిప్యూటీ ఈవో వెంకటేశ్వర్లు ఈవో వెంట ఉన్నారు.

తిరుమలలో నటి ప్రగ్యానయాన్



తిరుమల, జూలై18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం సినీనటి ప్రగ్యా నయాన్, ఎంహెచ్‌సీ ప్లాంటేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్ కింగ్ థిన్, ఎమ్మెల్యేలు ఆదిమూలం, బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ దాకా ఉంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.66 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,897

తలనీలాలు సమర్పించినవారు: 29,500

శభాశ్.. హరీశ్..!

● పాయింట్స్‌మన్‌కు డీఆర్ఎం అభినందన


హరీశ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో అగ్ని ప్రమాదం విస్తరించకుండా చర్యలు తీసుకున్న పాయింట్స్‌మన్ హరీశ్‌ను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అభినందించారు. అనంతపురం జిల్లా గుంతకల్లులోని రైల్వే డివిజనల్ కార్యాలయానికి రప్పించుకుని, శుక్రవారం ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. శాలువతో సన్మానించి, ప్రశంసాపత్రాన్ని, రివార్డును అందజేశారు. ఈ నెల 14న తిరుపతి స్టేషన్‌లో ఓ ఖాళీ బోగీలో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. దీన్ని గమనించిన పాయింట్స్‌మన్ హరీశ్, మంటలు వ్యాపించకుండా నిప్పంటుకున్న బోగీని ఇతర బోగీల నుంచి వేరుపరిచారు. రైల్వేకి ఆస్తి నష్టం జరక్కుండా సమయోచితంగా వ్యవహరించారు. ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండటమే కాకుండా ప్రాణాలకు తెగించి, ధైర్యసాహసాలను ప్రదర్శించారని డీఆర్ఎం అభినందించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

● రూ.67లక్షల విత్తనాలు, పురుగు మందుల సీజ్


ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో పురుగు మందుల పరిశీలన

వెంకటగిరి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు హెచ్చరించారు. శుక్రవారం వెంకటగిరి డివిజన్ పరిధిలోని పలు దుకాణాల్లో ఆయన బృందం తనిఖీలు నిర్వహించింది. రైతులు తీసుకున్న ప్రతి వస్తువుకూ బిల్లు ఇవ్వడంతో పాటు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. పూర్తిస్థాయిలో నమోదు చేయనందున రూ.21,99,979 విలువ గల ఎరువులు, రూ.45,19,240 పురుగు మందుల అమ్మకాలు నిలిపేశామన్నారు. ఓ రవాణా ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి ఎటువంటి ఆధారాలు లేకుండా వచ్చిన పురుగు మందులు, విత్తనాలు పరిశీలించారు. నందాల, ఆంజనేయ, అనసూయ, ఏవో సుజాత, ప్రవీణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

● రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో

వైసీపీ నేతను తప్పించేందుకు పైరవీలు

నాయుడుపేట టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో వైసీపీ నేతను తప్పించేందుకు ఆ పార్టీ నాయకులు జోరుగా పైరవీలు చేస్తున్నారు. ఈనెల 3వ తేదీ నాయుడుపేట - మల్లాం జంక్షన్ కూడలి వద్ద శ్రీకాళహస్తి నుంచి నెల్లూరుకు లారీలో అక్రమంగా తరలిస్తున్న 403 బస్తాల రేషన్ బియ్యాన్ని అర్బన్ సీఐ బాబి ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ గజేంద్రతో రేషన్ బియ్యం తరలింపులో వైసీపీ నాయకుడు పాత్ర ఉన్నట్లు తేలడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో సూళ్లూరుపేటకు చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం రాత్రి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని పోలీసులతో మంతనాలు ప్రారంభించారు. ఎలాగైనా కేసు నుంచి వైసీపీ నాయకుడిని తప్పించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

ఇద్దరు ఏపీపీల పదవీకాలం రద్దు

తిరుపతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు ఏపీపీల పదవీ కాలాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. తిరుపతి అడిషినల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు 2020 సెప్టెంబరు 9న న్యాయవాది సీహెచ్ శ్రీదేవి అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఆమె మూడేళ్ల పదవీ కాలం 2023 సెప్టెంబరులో ముగిసినా.. అదే ఏడాది నవంబరు నుంచీ కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, శ్రీకాళహస్తి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు గతేడాది మార్చి 15న న్యాయవాది సి.వీరరాఘవరెడ్డి అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. వీరిద్దరి పదవీ కాలాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రాసిక్యూషన్స్ విభాగం డైరెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో వారి పదవీ కాలాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

● భర్త బావిలో తోసి చంపిన ఘటనలో

భార్యా బిడ్డలకు అంత్యక్రియలు పూర్తి

తలారివారిపల్లిలో అలుముకున్న విషాదఛాయలు


తల్లారివారిపల్లిలో బిడ్డల సహా హేమంతకుమారి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

కల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పాకాల మండలం మద్దినాయనిపల్లి పంచాయతీ పెద్దూరు హరిజనవాడకు చెందిన హేమంతకుమారి (35), ఇద్దరు బిడ్డలు తనుశ్రీ(11), తేజశ్రీ (8)లకు శుక్రవారం రాత్రి చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ తలారివారిపల్లిలో అంత్యక్రియలు పూర్తిచేశారు. గురువారం మధ్యాహ్నం బంధువుల ఇంటికెళ్దామంటూ ద్విచక్రవాహనంపై భార్య, ఇద్దరు బిడ్డలను తీసుకెళ్లిన గిరి.. కోనెబోయిన ఇండ్లు సమీపంలోని బావిలో తోసేయడంతో ఆ ముగ్గురు మృతిచెందిన విషయం తెలిసిందే. తిరుపతి రుయాస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించాక హేమంతకుమారి పుట్టిల్లయిన తలారివారిపల్లికు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. తల్లీబిడ్డల మృతదేహాలను ఒక్క సారిగా చూసిన గ్రామస్తులు బోరున విలపించారు. దీంతో గ్రామంలో విషాఛాయలు అలుముకున్నాయి.



కరకంబాడి- కపిలతీర్థం రోడ్డు ఏమైంది?

ఇక కపిలతీర్థం నుంచి కరకంబాడి వరకు గతంలో ప్రతిపాదించిన మార్గం ఇప్పటికీ ఆచరణలోకి రాలేదు. అటవీ అనుమతుల్లో జరుగుతున్న జాప్యమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈరోడ్డును అందుబాటులోకి తీసుకొస్తే తిరుపతి నగరం మీద ట్రాఫిక్ ఒత్తిడి చాలా వరకూ తగ్గుతుంది.

పద్మవ్యూహంలా కపిలతీర్థం

● ట్రాఫిక్ కష్టాలు
● సీఎం గారూ మీరైనా దృష్టిపెట్టండి

తిరుపతి- ఆంధ్రజ్యోతి

అత్యంత పవిత్రమైన శైవక్షేత్రంగా తిరుపతిలోని కపిలతీర్థం ప్రసిద్ధి చెందుతోంది. కొండమీద నుంచి దూకే జలపాతం, విశాలమైన పుష్కరిణి, మండపాలతో కూడిన ఈ తీర్థం.. స్థానికులకే కాక, తిరుమలకు వచ్చిపోయే భక్తులనూ ఆకర్షిస్తోంది. వాహనాల్లో ప్రయాణించేవారు అక్కడ ఆగి కపిలేశ్వరుని దర్శించుకుని వెళ్తుంటారు. దీంతో నంది కూడలి అత్యంత రద్దీ ప్రాంతంగా మారిపోయింది. ట్రాఫిక్ జాం అన్నది ఇక్కడ సాధారణ విషయం అయ్యింది. సోమవారం రోజుల్లో అయితే ఈ సర్కిల్ దాటడం పెద్ద సమస్యగా మారుతోంది. దీనికి తోడు ఈ కూడలిలో తిరుపతి కార్పొరేషన్ పిలిగ్రిమ్ ఎమినిటీస్ సెంటర్ పేరుతో నిర్మించిన వాణిజ్యభవనం వద్ద నిలిచి పోయే వాహనాలతో మరింత గందరగోళం ఏర్పడుతోంది. నిబంధనలు పాటించని భవనాలపై చర్యలు తీసుకోవాల్సిన కార్పొరేషనే ఏకంగా ఏ నిబంధనలూ పాటించకుండా ఈ భవనాన్ని నిర్మించడం విచిత్రం. వైసీపీ పెద్దల అండదండలతో అప్పట్లో కోరినట్టు ఆ పార్టీ నేతలు నిర్మించుకున్న ఈ భవనం ఇప్పటికీ ఇదే తీరులో నడుస్తోంది. ట్రాఫిక్ కు మరింత ఇబ్బందిగా మారింది. నేడు కపిలతీర్థంను సందర్శిస్తున్న సీఎం చంద్రబాబు ఈ అంశంపై దృష్టి పెట్టాలని నగర ప్రజలు కోరుకుంటున్నారు.

నందిసర్కిల్ వరకు గరుడవారధి

గరుడ వారధి తొలుత అనుకున్న ప్రకారం నంది సర్కిల్ వరకు నిర్మిచి ఉంటే ట్రాఫిక్‌కు పెద్ద అంతరాయం కలిగివుండదు. అయితే వైసీపీ ప్రభుత్వం దానిని కుదించేసింది. అలిపిరి పోలీస్ స్టేషన్ వరకే పరిమితం చేసింది. పైగా రూ220 కోట్ల బడ్జెట్‌తో అలిపిరి దాకా పొడిగిస్తామంటూ అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఏకండి డిజైన్ కూడా సిద్ధం చేయించారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గారు. తొలి ప్లానింగ్ ప్రకారం కపిలతీర్థం దాటి మలుపుతిరిగేదాకా గరుడవారధిని పొడిగిస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లేదు.

కాలువలు కబ్జా

కొండమీద జల్లున పెద్ద వాన కురిస్తే చాలు కపిలతీర్థం, మాలాడగుండం జలపాతాలు ఉరకలేస్తూ దూకుతాయి. ఈ నీళ్లన్నీ వృర్థమవుతూ ఉంటాయి. అనేక చోట్ల ఆక్రమణలకు గురైపోయి ఇవి కుదించుకుపోయాయి. డ్రైనేజీతో కలిసిపోయి మురుగుకాలువలుగా ఈ రెండు కాలువలూ మారిపోయాయి. కపిలతీర్థం కాలువ అడుగున సిమెంటు లైనింగ్ వేసేయడంతో భూమిలోకి నీరు ఇంకకుండా జారిపోతోంది. ఇందువల్ల కాలువ తీర ప్రాంతాల్లోని భూగర్భజలాలు ఇంకిపోతున్నాయి. సిమెంట్ లైనింగ్ తొలగించాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకోవడంలేదు.

ఎక్కడా ఏమరపాటు వద్దు

● సీఎం పర్యటనలో అప్రమత్తంగా ఉండాలంటూ ఎస్పీ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఏమాత్రం ఏమరపాటు లేకుండా విధులు నిర్వహించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి శుక్రవారం పోలీసు పరేడ్ మైదానంలో బందోబస్తు విధులు కేటాయించి మాట్లాడారు. చంద్రబాబు పర్యటించే అన్ని చోట్ల అప్రమత్తంగా ఉంటూ, ప్రశాంత వాతావరణంలో పర్యటన సాగేలా చూడాలన్నారు. ప్రతి పోలీసు వారికి కేటాయించిన స్థలాలకు శుక్రవారం సాయంత్రం చేరుకుని విధుల్లో నిమగ్నం కావాలన్నారు. ఇప్పటికే పోలీసు శాఖ రిహార్సిల్స్ నిర్వహించింది. ఎవరైనా సీఎం పర్యటనను అడ్డుకునేలా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. తిరుపతిలో అనుమానితులు దాదాపు 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఆరు గంటల పాటు తిరుపతిలో సాగనున్న సీఎం పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం కాన్వాయ్‌లో కలెక్టర్‌తో పాటు ఎస్పీ, రిజర్వు బలగాలు ఉంటాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావు, కె.రవిమనోహరచారి, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు ఇలా

నలుగురు అదనపు ఎస్పీలు, పది మంది డీఎస్పీలు, 41 మంది సీఐలు, 73 మంది ఎస్‌ఐ లు, 288 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 490 మంది కానిస్టేబుళ్లు, 86 మంది మహిళా కానిస్టేబుళ్లు, 153 మంది హోం గార్డులు.. మొత్తం 1149మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారు. వీరికి విధులు కేటాయించారు.

'ప్రజా వేదిక'కు సర్వం సిద్ధం

● వర్షం వచ్చినా తడవకుండా 2500 మందికి ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి అనగాని, కలెక్టర్ తదితరులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 18(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పోలీసు పరేడ్ మైదానంలో శనివారం మధ్యాహ్నం సీఎం చంద్రబాబు నిర్వహించే ప్రజావేదికకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పీ4 కార్యక్రమం కింద దాతలుగా ముందుకు వచ్చిన మార్గదర్శులు, వారు దత్తత తీసుకునే బంగారు కుటుంబాలతో ముఖాముఖి సమావేశమవుతారు. ఈ కార్యక్రమంలో దాదాపు 2500 మంది పాల్గొంటున్నారు. భారీ వర్షం వచ్చినా తడవకుండా ఉండేలా రెయిన్ ప్రూఫ్ జర్మనీ టెంట్లు వేశారు. అక్కడే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కింద ఆరు స్టాళ్ల ఏర్పాటు చేశారు. వచ్చిన వాళ్లందికీ తాగునీరు, బిస్కెట్లు, మజ్జిగ పంపిణీ చేయనున్నారు. మార్గదర్శుల్లో కొందరిని సీఎం సన్మానించనున్నారు. దాదాపు 1.45 గంటలపాటు జరగనున్న కార్యక్రమానికి సంబంధించి ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను మంత్రి అనగాని సత్యప్రసాద్, సీఎం కార్యక్రమాల కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, కూటమి నాయకులు, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ హర్షవర్ధనరాజు,కమిషనరు మౌర్య, ఆర్డీవో రామ్మోహన్‌రావు, అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, జిల్లా అధికారులు పరిశీలించారు.



చంద్రగిరి ఎమ్మెల్యే నానికి మాతృవియోగం

● పలువురు ప్రముఖుల నివాళి



పాకాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి మాతృవియోగం కలిగింది. చిత్తూరులోని స్వగృహంలో శుక్రవారం ఉదయం నాని తల్లి లక్ష్మీభారతి(80) కన్నుమూశారు. కొద్దికాలంగా వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. పాకాల మండలం పులివర్తివారిపల్లెలో ఆమె పార్థివ దేహానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరిలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, గాలి భానుప్రకాష్, డాక్టర్ మురళీమోహన్, ఆరణి శ్రీనివాసులు, థామస్, తుడా చెర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రరెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ సుబ్రమణ్యంనాయుడు, చంద్రగిరి ఏఎంసీ ఛైర్మన్ గౌస్‌బాషా, కిరణ్ రాయల్, సీకే లావణ్య, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. నాని కుటుంబ సభ్యులకు నాయకులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తన తల్లి అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు పులివర్తివారి పల్లెలో జరుగుతాయని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు.

లక్ష్మీభారతి పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న టీటీడీ ఛైర్మెన్ బీఆర్ నాయుడు, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి - లక్ష్మీభారతి(ఫైల్ ఫొటో)


లక్ష్మీభారతి పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు భానుప్రకాశ్, థామస్, టీడీపీ నేతలు చల్లా బాబు, దొరబాబు, బద్రినారాయణ, చిట్టిబాబు, గాంధీ

ఎమ్మెల్యేపై మహిళా కమిషన్‌కు రోజా ఫిర్యాదు

పుత్తూరు,జూలై18(ఆంధ్రజ్యోతి): తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ పలు సందర్భాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే భానుప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ మంత్రి రోజా రాష్ట్ర మహిళా కమిషన్‌కు శుక్రవారం మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. భాను చేసిన వ్యాఖ్యలను ఉటంకించారు. ఎమ్మెల్యే పదవిలో ఉండీ, ఇలా మాట్లాడుతున్న భానుప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

అధికారులకు ఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశం

తిరుపతి(ఆటోనగర్), జూలై18(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని ఐదు ఉమ్మడి జిల్లాల్లో గృహ వినియోగదారులకు, రైతులకు, పారిశ్రామికవేత్తలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా క్షేత్రస్థాయిలో పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని సంస్థ సీఎండీ కె.సంతోషరావు ఆదేశించారు. తిరుపతిలోని అనెక్స్ భవనంలోని సమావేశ మందిరంలో అన్ని జిల్లాల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పీఎం సూర్యఘర్ పథకంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో వేగం పెంచాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు మెరుగుపరచాలని సూచించారు. పొలాల్లో మరమ్మతులకు గురైన విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఆదేశించారు. పెండింగ్ వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయని వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సరఫరాలో అంతరాయం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1912కి లేదా 1800 425155333, 9133331912లకు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, సీజీఎంలు జె.రమణాదేవి, కె.ఆర్.ఎస్.ధర్మజ్ఞాని, డీఎస్ వరకుమార్, పి.హెచ్.జానకిరామ్, ఆదిశేషయ్య, శోభావాలంటీనా, కె.రామమోహన్‌రావు, పి.మురళి, జీఎంలు ఎం.కృష్ణారెడ్డి, నీలం నరేంద్రనాథ్, శ్రీనివాసులు, సురేంద్రనాథ్, మురళి, చక్రపాణి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విడవని జడివాన


చిత్తూరు ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద కురుస్తున్న వర్షం

చిత్తూరు కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో రోజంతా ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలు శుక్రవారం రాత్రి దాదాపు అరగంట కురిసిన జడివానతో ఉపశమనం పొందారు. చర్చి, పొన్నియమ్మ గుడి, బజారు వీధుల్లో చిరు వ్యాపారాలు ఇబ్బంది పడ్డారు. డీఐ రోడ్డు, జెండామానువీధి, మార్కెట్ చౌక్ వద్ద వర్షం కారణంగా రోడ్లపై మురుగు ప్రవహించడంతో స్థానికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఆడిమాస తొలి శుక్రవారం పూజలకు వచ్చిన భక్తులు ఇంటికెళ్లడానికి వాన కారణంగా అసౌకర్యానికి గురయ్యారు.

టీటీడీలో క్రైస్తవ ఉద్యోగిని తొలగించాలంటూ ఫిర్యాదు


చర్చిలో కన్నిగ (ఓంకార్ విడుదల చేసిన చిత్రమిది)

తిరుమల, జూలై18(ఆంధ్రజ్యోతి): టీటీడీలో క్రైస్తవ ఉద్యోగిని కన్నిగను తక్షణమే విధుల నుంచి తొలగించాలని తిరుక్షేత్రాల రక్షణ సమితి స్టేట్ ప్రెసిడెంట్ తుమ్మా ఓంకార్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. టీటీడీ విద్యుత్ విభాగం ఏఈ కన్నిగ ప్రతి ఆదివారం ఎస్వీ నగర్ చర్చిలో బైబిల్ తరగతులు చెబుతున్నారంటూ, ఆమె ప్రార్థన చేసిన వీడియోతో శుక్రవారం టీటీడీ ఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. ప్రతి ఆదివారం చర్చిలో బైబిల్ క్లాసులు బోధిస్తున్న వీడియోను 2019లోనే టీటీడీకి అందజేసినా ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు. ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, శాశ్వతంగా టీటీడీ నుంచి బహిష్కరించాలని డిమాండు చేశారు. ఈ మేరకు ఆయన ఫొటోనూ విడుదల చేశారు.

ఎర్రచందనం స్వాధీనం

ఏడుగురు తమిళ కూలీల అరెస్ట్



ఎర్రచందనం దుంగలతో సహా కూలీలను అరెస్ట్ చూపుతున్న డీఎఫ్‌వో గురుప్రభాకర్

కల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు ఘాట్ రోడ్డు సమీపంలోని కొమ్మిరెడ్డిగారిపల్లి క్రాస్ వద్ద శుక్రవారం వేకువజామున వాహనంతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని తమిళనాడుకు చెందిన ఏడుగురు కూలీలను అటవీ అధికారులు అరెస్టు చేశారు. అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో గురుప్రభాకర్ కథనం మేరకు.. అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వోకు అందిన ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం వేకువజామున అటవీశాఖ సిబ్బంది పులిచెర్ల మండలం కల్లూరు నాలుగురోడ్ల కూడలిలో వాహనాలను తనిఖీ చేపట్టారు. పీలేరు వైపు నుంచి చిత్తూరు వైపు మారుతీ సుజుకీ వాహనం వేగంగా దూసుకెళ్లింది. దీంతో అటవీశాఖ సిబ్బంది ఆ వాహనాన్ని వెంబడించగా కొమ్మిరెడ్డిగారిపల్లి క్రాస్ వద్ద ఉన్న బస్‌షెల్టర్‌ను ఢీకొంది. దీంతో వాహనాన్ని చుట్టుముట్టిన పోలీసులు వాహనంలోని ఏడుగురు కూలీలను అదుపులోకి తీసుకోగా అప్పటికే వాహనం డ్రైవర్ పరారయ్యాడు. వాహనంలోని 403 కిలోల బరువున్న 13 ఎర్రచందనం దుంగలు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనంతో సహా ఎర్రచందనం దుంగలు విలువ రూ.20 లక్షలు ఉంటుంది. తమిళనాడు రాష్ట్రం కలవకుచ్చి జిల్లా కళువరామ్‌మలై గ్రామానికి చెందిన కూలీలు ఏలుమలై, సెందిల్, అన్‌బమాన్, రామన్, అన్నాదొరై, కుప్పుస్వామి, మణిగా నిర్ధారించారు. డ్రైవర్‌ది ఇదే జిల్లా సైరాపట్టుకు చెందిన అజయ్‌కుమార్‌గా గుర్తించారు. ఈ ఏడుగురు కూలీలను తిరుపతి ఎర్రచందనం కోర్టులో హాజరుపరచగా వీరికి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. ఈ దాడుల్లో ఎఫ్ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్ఎస్‌వో ప్రకాష్‌కుమార్, ఎఫ్‌బీవోలు ప్రతాప్, రెడ్డిప్రసాద్, నందీశ్వరయ్య, వాచర్లు పాల్గొన్నారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు



వంకాయ తోటకు అమర్చిన ఇనుపకంచె, రాతికూసాలను ధ్వంసం చేసిన ఏనుగులు - జూపల్లి వద్ద సంచరించిన ఏనుగుల గుంపు పాదాల గుర్తులు

కల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతున్నాయి. మండలంలోని పాళెం, దేవళంపేట పంచాయతీల్లో గురువారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేశాయి. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ కుమ్మరిపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతు వెంకటాచలానికి చెందిన మామిడి కొమ్మలను విరిచాయి. రైతు సరస్వతికి చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు మరో రైతు రవినాయుడుకు చెందిన పశుగ్రాసాన్ని తినేశాయి. అక్కడి నుంచి పాళెం పంచాయతీ జూపల్లి వద్దకు చేరుకున్న ఏనుగుల గుంపు గ్రామంలోని రైతు రాజేంద్రకు చెందిన వంకాయచెట్లను, రాతికూసాలు, రైతు జయపాల్‌కు చెందిన డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. సమీపంలోని కోటపల్లి గ్రామానికి ఆనుకొని ఉన్న రైతులు మధు, హరినాథ్‌కు చెందిన మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి తూర్పు విభాగం అడవిలోకి చేరుకున్నాయి. శుక్రవారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు సమీపంలో ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

●ఎల్లంకివారిపల్లి వైపు వస్తున్న మరో గుంపు

పులిచెర్ల మండలంలో కొన్నాళ్లుగా తిష్ట వేసిన ఏనుగుల గుంపు దాడులతో ఒకవైపు పంటలకు అపారనష్టం కలుగుతుండగా మరో వైపు తిరుపతి జిల్లా భీమవరం సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి మరొక ఏనుగుల గుంపు పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి పంచాయతీ వైపు అడుగులు వేస్తున్నాయని ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి తెలిపారు. అటవీ సరిహద్దులో ఉన్న ఎల్లంకివారిపల్లి, పోశంవారిపల్లి, కావేటిగారిపల్లి, మంగళంపేట పంచాయతీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎస్‌వో హెచ్చరించారు.

టెన్త్ మూల్యాంకన రెమ్యునరేషన్ చెల్లించండి



ఏడీ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

చిత్తూరు సెంట్రల్, జూలై18(ఆంధ్రజ్యోతి): ఇటీవల విద్యాశాఖ నిర్వహించిన టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకనం రెమ్యునరేషన్‌ను చెల్లించాలని విద్యాశాఖ అధికారులకు ఎస్టీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఏడీ వెంకటేశ్వరరావును ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్ యాదవ్, నాయకులు లింగమూర్తి, నరేంద్ర తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు. మూల్యాంకనం ప్రక్రియ పూర్తై మూడు నెలలు కావస్తున్నా.. సంబంధిత టీచర్లకు రెమ్యునరేషన్ రాలేదన్నారు. వీటి చెల్లింపులకు చర్యలు చేపట్టాలని, బదిలీలకు ముందు ఇచ్చిన పదోన్నతుల్లో సోషల్ స్టడీస్, గణితం బయాలజీ సబ్జెక్టులకు సంబంధించి పదోన్నతుల పోస్టులు మిగిలిపోయాయని, వీటిని భర్తీ చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనంలో నిత్యావసర సరుకుల పంపిణీలో భాగంగా సన్న బియ్యం, రాగి పిండిని నేరుగా కాకుండా, క్లస్టర్ ద్వారా ఇవ్వడంతో టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వీటిని నేరుగా పాఠశాలలకు సరఫరా చేయాలని కోరారు.

పెనుమూరులో 95.6 మి.మీ వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో పలు మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. పెనుమూరులో అత్యధికంగా 95.6, కుప్పంలో అత్యల్పంగా 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. రొంపిచెర్లలో 72.4, వెదురుకుప్పంలో 67.2, తవణంపల్లెలో 44.8, ఐరాలలో 43, పులిచెర్లలో 41, శ్రీరంగరాజపురంలో 35.4, పెద్దపంజాణిలో 34.8, పూతలపట్టులో 34.6, విజయపురంలో 30.4, పుంగనూరులో 29.4, బంగారుపాళ్యంలో 22.4, చౌడేపల్లెలో 20.2, కార్వేటినగరంలో 19.6, సదుంలో 19.4, సోమలలో 14.6, చిత్తూరు అర్బన్, పాలసముద్రంలో 13.6, గుడిపాల, గంగాధరనెల్లూరు, చిత్తూరు రూరల్ మండలాల్లో 13, గంగవరంలో 12.6, నింద్రలో 12.2, యాదమరిలో 10.6, వి.కోటలో 9, శాంతిపురంలో 7.6, పలమనేరులో 7.4, రామకుప్పంలో 6.6, బైరెడ్డిపల్లెలో 4.8, గుడుపల్లెలో 2.6, నగరిలో 2.4 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.

టీడీపీ నేత ఇంట్లో చోరీ



దుండగులు తెరచిన బీరువా - దుండగుల ఆచూకీ కోసం లోనికి వెళ్తున్న పోలీసు జాగిలం

పలమనేరు, జూలై18 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పలమనేరు మాజీ సర్పంచ్, బాలాజి కో-ఆపరేటివ్ సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్‌వీ.బాలాజి ఇంట్లో దొంగలు పడ్డారు. బాలాజీ తన భార్యతో కలిసి వారం రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసుకొని హైదరాబాదులోని తన కుమార్తె వద్దకు వెళ్లారు. గత రాత్రి 11 గంటల ప్రాంతంలో బాలాజి, ఆయన సతీమణి, కుమార్తె, అల్లుడు హైదరాబాదు నుంచి పలమనేరుకు వచ్చారు. ప్రయాణ బడలిక కారణంగా రాత్రి ఇంటికి చేరుకొని నిద్రపోయారు. శుక్రవారం ఉదయం పనిమనిషి వచ్చి మిద్దెపైన గదికి ఉన్న కిటికీ ఊచలు తొలగించి ఉండటాన్ని గుర్తించి బాలాజీకి తెలియజేసింది. వెంటనే ఆయన ఇంట్లోని గదులను పరిశీలించగా దొంగలు పడినట్లు గుర్తించారు. ఇంటి హాలులో ఉన్న సీసీ కెమెరాను సైతం దుండగులు విరిచివేసి తీసుకు వెళ్లినట్లు తెలిసింది. చోరీ జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నరసింహరాజు, ఎస్ఐ స్వర్ణతేజ ఇంటిని పరిశీలించారు. క్లూస్‌టీంను, పోలీసు జాగిలంతో వేలిముద్రలు సేకరించారు. సుమారు రూ. 4లక్షల నగదు, పెద్దమొత్తంలో బంగారు చోరీకి గురైనట్లు తెలుస్తోంది. ఎంత మొత్తం నగదు, బంగారు చోరీకి గురైందన్న వివరాలు సేకరిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఈఈ సెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న వరలక్ష్మి, అధ్యాపకులు

వెదురుకుప్పం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో 13 మంది డీఈఈ సెట్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ వరలక్ష్మి శుక్రవారం తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ దామోదర రావు, అధ్యాపకులు నాగరాజునాయక్, దశరథుడు, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛను విధానాన్ని అమలు చేయాలి

● కలెక్టరేట్ వద్ద 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరం డిమాండ్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

చిత్తూరు అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తమకు పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరమ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఫోరమ్ కన్వీనర్లు మోహన్ యాదవ్, ఢిల్లీప్రకాష్, వెంకటేష్ ప్రసంగించారు. సీపీఎస్, ఎన్‌పీఎస్ అమలు కంటే ముందే నోటిఫికేషన్ ద్వారా ఎంపికై.. ఇతరత్రా కారణాలతో ఆలస్యంగా ఉద్యోగాల్లో చేరి.. ఎన్‌పీఎస్ పరిధిలో ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పింఛను విధానాన్ని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రాష్ట్రంలోనూ 2004 సెప్టెంబరు ఒకటో తేదీకంటే ముందే ఉద్యోగాలకు ఎంపికై అప్పటి ప్రభుత్వ కాలపరిమితి ముగిసి.. కొత్త ప్రభుత్వం ఏర్పాటు, తదితర కారణాలతో ఆలస్యంగా 11వేల మంది ఉద్యోగాల్లో చేరామన్నారు. తమకు ఎలాంటి సంబంధం లేని, నోటిఫికేషన్‌లో చెప్పని సీపీఎస్ విధానంలోకి బలవంతంగా నెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు జరిగిన అన్యాయాన్ని గత ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకోగా.. రాష్ట్ర సచివాలయ దృష్టిలో ఉందని, త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చి వదిలేశారన్నారు. తమలాంటి చిరుద్యోగులకు అన్యాయం చేయడం తగదన్నారు. అనంతరం డీఆర్వో మోహన్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఫోరమ్ నేతలు మధు, శ్రీధర్, కోదండరెడ్డి, మణిగండన్, ఎస్టీయూ నేతలు గంటా మోహన్, జీవీ రమణ, బాలాజి, జగన్మోహన్‌రెడ్డి, నాగరాజురెడ్డి, కిరణ్‌కుమార్, మునాఫ్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణ ఉండాలి : ఎస్పీ



పోలీసు స్టేషన్‌లో వివరాలు తెలుసుకొంటున్న ఎస్పీ మణికంఠ

పలమనేరు,జూలై18 (ఆంధ్రజ్యోతి) : నిరంతర పర్యవేక్షణతో నేరాలు తగ్గుతాయని ఎస్పీ మణికంఠ తెలియజేశారు. పలమనేరు పోలీసు స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్‌రోస్టర్, వివిధ క్రైం రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసులు, వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు, తీరుతెన్నులు వాటిపురోగతిపై కేసుల ఫైల్స్‌ను పరిశీలించారు. ముఖ్యంగా రోడ్డుప్రమాదాల నియంత్రణకు తీసుకొన్న చర్యలను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిందితులు అరెస్టుకాని కేసుల్లో త్వరగా అరెస్టులు చేయాలని ఆదేశించారు. బ్లాక్ స్పాట్‌లను సందర్శించి రోడ్డుప్రమాదాలు జరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు. మహిళా పోలీసులు ఇంటింటికీ వెళ్లి మహిళలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే సైబర్‌నేరాలు, లోన్‌యాప్‌ల మోసాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, ఫోక్సో నేరాలపై అప్రమత్తం చేయాలని సూచించారు. డ్రంకెన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పోలీసు క్వార్టర్స్ నిర్మాణ పనులను పరిశీలించారు.పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్, అర్బన్ సీఐ నరసింహరాజు, ఎస్ఐ లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.



టీడీపీ ఎంపీల సమావేశంలో దగ్గుమళ్ల

చిత్తూరు సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నిర్వహించిన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశాల్లో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పాల్గొన్నారు. శుక్రవారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఇందులో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టులు, మహిళా నేతలపై అసభ్య ప్రచారం, ఏరోస్పేస్ ఇండస్ట్రీ, స్పేస్ సిటీ, పోలవరం-బనకచర్ల, హంద్రీ-నీవా, రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులు, అమరావతిలో కాంటమ్ వ్యాలీ, అమరావతి అభివృద్ధికి చర్యలు తదితర అంశాలపై పార్లమెంటులో మాట్లాడే విధంగా సమావేశంలో చర్చించారు. సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అసెంబ్లీ పిటిషన్ల కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే జగన్మోహన్



చిత్తూరు సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ సైబర్ నేరాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అసెంబ్లీ పిటిషన్ల కమిటీ ఛైర్మన్, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు చెప్పారు. శుక్రవారం అమరావతిలోని అసెంబ్లీ కమిటీ హాలులో పిటిషన్ల కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యుడిగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సమావేశంలో పాల్గొన్నారు. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ చేయగానే ఫిర్యాదు రిజిస్టర్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బెట్టింగ్ యాప్‌లపైనా ఈనెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని నేతలు సూచించారు. బెట్టింగ్ యాప్‌లతో కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. కమిటీ సభ్యులు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.

మామిడి తోటను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు



ధ్వంసమైన మామిడి చెట్లు

తవణంపల్లె, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మండలంలోని అటవీ ప్రాంతమైన మాధవరం గ్రామంలోని మామిడి తోటలపై గురువారం రాత్రి ఒంటరి ఏనుగు దాడి చేసింది. గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి మామిడి తోటలోని చెట్లను విరిచేసింది. ఏడాదిపాటు కాపాడుకున్న పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో ధ్వంసం చేయడంతో బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పన : జేసీ



గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ విద్యాధరి

యాదమరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని జేసీ విద్యాధరి అన్నారు. యాదమరి మండల పరిధిలోని కీనాటంపల్లె పంచాయతీ షికారికాలనీలో శుక్రవారం ఉదయం మౌలిక వసతుల కల్పన పెంపులో భాగంగా నిర్వహించిన హౌస్ హోల్డ్ సర్వే కార్యక్రమంలో రెవెన్యూ అధికారులతో కలిసి గ్రామాల్లో జేసీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ కాలనీల్లో అధికారులు డోర్ టూ డోర్ సర్వే చేపట్టి ఆధార్ కార్డు నమోదు, ఇంకా ఏవైనా సమస్యలుంటే తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా తమకు శ్మశానానికి స్థలం లేదని, నూతన మంచినీటి సరఫరా బోరు మంజూరు చేయాలని, కొత్త ఇళ్లు కట్టించి, పట్టాలు అందజేయాలని, ఆధార్‌కార్డులు లేకపోవడం వల్ల వృద్ధాప్య పింఛన్లు రావడం లేదని జేసీ దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, ఆర్ఐ ప్రసాద్, మండల సర్వేయర్ తులసీధర్, వీఆర్వో సురేష్ బాబు, కార్యదర్శి దివ్య, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ - అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు

చౌడేపల్లె, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాలాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆషాఢ శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం భక్తుల అన్నదాన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

పూతలపట్టు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నలుగురు గంజాయి విక్రేతలను అరెస్టు చేశారు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ తెలిపిన వివరాల మేరకు.. పూతలపట్టు మండలంలోని ఎం.బండపల్లె గ్రామానికి చెందిన మోహన్‌బాబు, అతడి కుటుంబీకులు గంజాయిని అమ్ముతున్నారని సమాచారం వచ్చింది. శుక్రవారం పోలీసులు వారింటికెళ్లగా కుటుంబీకులతో కలిసి మోహన్‌బాబు పరారయ్యాడు. అనంతరం బండపల్లె సమీపాన ఉన్న ఫ్లైఓవర్ వద్దకు సీఐ చేరుకోగా.. అక్కడ తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన రమేష్, హరికృష్ణమూర్తి, ఆంబూరుకు చెందిన ఆకాష్, హరిహరన్ తారసపడ్డారు. విచారించగా వారి వద్ద 1.20 కిలోల గంజాయి బయటపడింది. ఆ గంజాయిని, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారైన నిందితులకోసం గాలిస్తున్నారు.

భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

శాంతి పురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన భూ సమస్యలను పరిష్కరించడమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుందని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం శాంతిపురం మండల పరిధిలోని బీఎం గొల్లపల్లె రెవిన్యూ పరిధిలోని రైతులకు డీకేటీ పట్టాల పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ రైతులకు పట్టాలు పంపిణీ చేసి ప్రసంగించారు. బీఎం గొల్లపల్లె రెవిన్యూ గ్రామ పరిధిలోని సుమారు 80 మంది రైతులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శివయ్య, టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారాం, టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయకుమార్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పీవీ నాగరాజు, రాజేంద్ర, రాళ్లబూదుగూరు మాజీ క్లస్టర్ ఇంచార్జి చంద్రశేఖర్, యూనిట్ ఇంచార్జిలు పెద్దన్న, నారాయణస్వామి, మణి, నేతలు రుద్రప్ప, ఎంసి నాగరాజు, అధికారులు, రైతులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



రామకుప్పం, జూలై 18(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బిరుగుండ్లపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త గంగాధరం తల్లి కమలమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి స్థానిక నేతలో కలిసి కమలమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం పార్టీ తరఫున మృతురాలి కుటుంబసభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. మాజీ సర్పంచి పెరుమాళ్, నేతలు సుబ్రహ్మణ్యం, మురళీమోహన్, ఆనంద్ పాల్గొన్నారు.

పేదలకు అండగా చంద్రబాబు : టీడీపీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అంజనేయరెడ్డి

రామకుప్పం, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి పేదకుటుంబానికి సీఎం చంద్రబాబు అండగా నిలుస్తున్నారని టీడీపీ రామకుప్పం మండల మాజీ అధ్యక్షుడు అంజనేయరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన రామకుప్పంలో స్థానిక నేతలతో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అందరికీ మంచి చేస్తున్న చంద్రబాబు నాయకత్వాన్ని ప్రతి ఒక్కరూ బలపరచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్, మాజీ ఉపసర్పంచు గంట్లరెడ్డి, నేతలు గజేంద్ర, మంజునాథ్, వీరనాగపురంనాగరాజు, దయానంద్, గిరిదాసు, అల్లీసీనలు పాల్గొన్నారు.

జ్వరాలు రాకుండా అప్రమత్తంగా ఉండాలి

రామకుప్పం, జూలై 18(ఆంధ్రజ్యోతి): వానాకాలం ప్రారంభమవడంతో ప్రజలు జ్వరాలు రాకుండా అప్రమత్తంగా ఉండాలని రామకుప్పం మండలం విజలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి పూజిత కోరారు. డెంగ్యూ మాసోత్సవం పురస్కరించుకుని శుక్రవారం పీహెచ్‌సీ పరిధి జౌకుపల్లె గ్రామంలో జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె సిబ్బందితో కలసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, ఎంఎల్‌హెచ్‌పీ పుష్ప, ఏఎన్ఎం గ్లోరీ, ఆశాకార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి



విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పుంగనూరు రూరల్, జూలై18(ఆంధ్రజ్యోతి): వాతావరణ కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాల్సిన అవసరముందని శుభారాం ప్రభుత్వ డిగ్రీకాలేజీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కాలేజీ ఆవరణలో విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీలో ఒక విద్యార్థి- ఒక మొక్క అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి కాలేజీ ఆవరణలో మొక్కలు నాటి వారిని సంరక్షించిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలని వినతి

పుంగనూరు రూరల్, జూలై18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదుగులపల్లె పంచాయతీ కంతేపల్లెలో మురుగుకాల్వలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎంపీడీవో లీలామాధవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కాల్వలు నిర్మాణాలకు ఎక్సవేటర్‌తో తవ్వి పనులు చేయకపోవంతో వర్షపునీరు నిల్వ నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు గంగులప్ప, శంకరప్ప, చిన్నప్ప, గంగరాజు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అలసత్వం వద్దు

కల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే సంబంధిత కార్యదర్శులపై చర్యలు తప్పవని ఎంపీడీవో రాజశేఖర్ హెచ్చరించారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి క్లోరినేషన్ చేపట్టాలన్నారు. తాగునీటి పైపుల లీకేజీలను అరికట్టాలన్నారు.

స్కూటరిస్టుపై టిప్పర్ డ్రైవర్ల దాడి

పుంగనూరు, జూలై18(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారుడిపై టిప్పర్ వేగంగా దూసుకువస్తుండగా ప్రశ్నించిన స్కూటరిస్టుపై టిప్పర్ డ్రైవర్లు దాడిచేసి గాయపరిచాడు. ఈ సంఘటన శుక్రవారం పుంగనూరు మండలంలో జరిగింది. బాధితుని కథనం మేరకు.. పుంగనూరు మండలం మోదుగులపల్లె పంచాయతీ బరిసేపల్లెకు ద్విచక్రవాహనంలో వెళుతున్న జగన్నాథంయాదవ్ పైకి హంద్రీనీవా కాలువ వద్ద టిప్పర్ దూసుకురావడంతో ఆయన భయాందోళనకు గురయ్యాడు. దీంతో టిప్పర్ డ్రైవర్‌ను నిలదీశాడు. దీంతో పత్రపల్లి నుంచి వస్తున్న టిప్పర్ డ్రైవర్లు బుడ్డారెడ్డి, వాసులు జగన్నాథంపై దాడి చేసి గాయపరిచారు. అతడిని స్థానికులు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎస్టీ కాలనీల్లో సౌకర్యాల కల్పనకు సర్వే

శాంతిపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఒడ్డువంక ఎస్టీ కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సర్వే చేపట్టిందని ఎంపీడీవో కుమార్ తెలిపారు, శుక్రవారం గ్రామంలో అధికారులతో కలిసి ఆయన సర్వే చేపట్టారు. కాలనీలో అవసరమైన తారోడ్లు, సీసీ రోడ్లు, తాగునీటి వసతి, ఇతర గ్రామాభివృద్ధికి ప్రణాళిలు సిద్ధం చేసి అధికారులకు నివేదికను పంపుతామన్నారు. తాగునీటి బోర్లను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. అనంతరం ఎంకేపురం గ్రామ సమీపంలోని జనప చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో అభిషేకపూజలు



సోమల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కందూరులో కొలువుదీరిన కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి రాహుకాల పూజలు జరిపారు. ఉభయదారులు నాగభూషణంశెట్టి, ఉమామహేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు అమ్మవారికి విశేష అలంకరణ చేసి సంకీర్తనలు ఆలపించారు. అర్చకులు పద్మనాభశాస్త్రి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బాలిక అదృశ్యంపై పోక్సో కేసు

పుంగనూరు రూరల్, జూలై18(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం బోడేవారిపల్లెకు చెందిన సాయి(34)పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. ఓ బాలిక(14)ను సాయి ఈనెల 16తేదీ రాత్రి తీసుకెళ్లిపోవడంతో అతనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

'తొలిఅడుగు'ను వేగవంతం చేయాలి

రొంపిచెర్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం ఈనెలాఖరులోగా పూర్తిచేయాలని కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ అన్నారు. శుక్రవారం ఆయన రొంపిచెర్ల టీడీపీ కార్యాలయంలో మండలా వారీ కార్యక్రమం పనితీరుపై ఫోన్ ద్వారా నాయకుల నుంచి వివరాలు సేకరించారు. టీడీపీ నాయకులు బూత్‌కమిటీ, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం

సోమల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో మండలంలో జరుగుతున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై టీడీపీ నాయకులతో సమీక్షించారు. ప్రజలకు కోసం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సింగిల్ విండో ఛైర్మన్ శివశంకర్, మహేంద్రబాబు, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, బాలాజీ నాయుడు, శ్రీనివాసులు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

నేడు చల్లా రామచంద్రారెడ్డి పర్యటన

కల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి పంచాయతీలో శనివారం ఉదయం 9 గంటలకు పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పర్యటించనున్నట్లు సింగిల్ విండో అధ్యక్షులు ధనంజయ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు మునికృష్ణమనాయుడు తెలిపారు. పంచాయతీ పరిధిలోని దిగుమూర్తివారిపల్లిలో నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు విరాళాలు

సోమల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సోమలలోని శ్రీకృష్ణదేవరాయుల సర్కిల్‌లో నూతనంగా ఆయన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి పెద్దఉప్పరపల్లె నుంచి శుక్రవారం విరాళాలు అందినట్లు కమిటీ అధ్యక్షులు ఎన్. మునివెంకటప్ప తెలిపారు. జి. ధర్మతేజ రూ. 20,116, జే. వాసుప్రసాద్ రూ.5వేలు, సుధారాణి రూ. 5,116, తదితరులు రెండు వేలు వంతున పలువురు విరాళాలు అందజేసినట్లు వివరించారు.

ప్లాస్టిక్‌ను బహిష్కరించాలి



నూలుతో చేసిన చేతి సంచులను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్, తదితరులు

పలమనేరు, జూలై18 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తిపలకాలని మున్సిపల్ కమిషనర్ ఎస్. వి. రమణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పలమనేరు గంగమ్మగుడి వీధిలోని మున్సిపల్ వాణిజ్యసముదాయం వద్ద నూలుతో తయారు చేసిన సంచుల విక్రయ దుకాణాన్ని కమిషనర్ ప్రారంభించారు. అనంతరం కూర గాయల దుకాణదారులకు సంచులను అందించారు. వారివద్ద ఉన్న ప్లాస్టిక్‌తో తయారుచేసిన సంచులను స్వాధీనం చేసుకొన్నారు. పలమనేరు మెప్మా అధికారి బాబా, మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

పలమనేరు, జూలై18 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రభుత్వాస్పత్రిని మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలు, పారిశుధ్య నిర్వహణ, ఓపి సేవలు, రిజిస్టర్లు, వివిధ విభాగాలను, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. రోగులకు అందజేసే భోజనాన్ని కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం తహసీల్దార్‌గా రేఖ



తహసీల్దార్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

గంగవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గంగవరం తహసీల్దార్‌గా పి.రేఖ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిన్నటివరకు తహసీల్దార్‌గా ఉన్న మాధవరాజును చిత్తూరు కలెక్టరేట్‌కు బదిలీచేయగా, ఆయన స్థానంలో ఎస్.ఆర్.పురం తహసీల్దార్‌గా ఉన్న పి.రేఖను గంగవరానికి బదిలీచేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రేఖకు రెవిన్యూ సిబ్బంది స్వాగతం పలికారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

రామకుప్పం, జూలై 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే మారుమూల ప్రాంతాలు సైతం అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి తెలిపారు. శుక్రవారం వారు రామకుప్పం మండల పరిధి పాలరేవుగడ్డలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిరిదాసు, శ్రీనివాసులు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరిగా దుర్గమ్మ

వి.కోట, జూలై 18(ఆంధ్రజ్యోతి): వి.కోటలో వెలసిన దుర్గమ్మ వారు ఆషాఢ అష్టమి శుక్రవారాన్ని పురస్కరించుకుని శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు భాస్కర్‌శర్మ అమ్మవారికి పూజలు చేశారు.

గంగమ్మా.. ఆదుకోవమ్మా



కప్పను ఊరేగిస్తున్న చిన్నారులు

రామకుప్పం, జూలై 18(ఆంధ్రజ్యోతి): వానలు బాగా కురవాలని, రైతులను ఆదుకోవాలంటూ రామకుప్పం దిగువవీధి గంగమ్మ ఆలయ నిర్వాహకులు గురువారం రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. అనంతరం చిన్నారులు రోకలికి కప్పంను కట్టి, వానలు కురిపించాలంటూ అమ్మవారిని కోరుతూ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. చివరగా ఆలయం గుమ్మం వద్ద బంకమన్నుతో కట్ట ఏర్పాటు చేసి, అమ్మవారు మునిగేంత నీటిని నింపారు. ఆ జలాల్లో పసుపు, కుంకుమలు వేసి, కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చారు. పూజల అనంతరం భక్తులకు అంబలి, అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

బోయకొండలో అంబులెన్స్ ఏర్పాటు చేయండి



ఈవో ఏకాంబరం కు వినతి పత్రం అందిస్తున్న రాజేంద్రనాయుడు, సంఘం సభ్యులు

చౌడేపల్లె, జూలై18(ఆంధ్రజ్యోతి):ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ భక్తుల సౌకర్యం కోసం అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రనాయుడు ఆలయ ఈవో ఏకాంబరానికి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం ఆలయ ప్రధాన కార్యాలయంలో వారు ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం అమ్మవారి దర్శనం కోసం వేలాది మంది భక్తులు కొండకు వస్తుంటారన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వివరించారు. ఈవో స్పందిస్తూ దాతల సహకారంతో అంబులెన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని, మీ సంఘం ద్వారా డొనెట్ చేసే అవకాశం ఉంటే ప్రయత్నించాలని కోరారు. వారు సానుకూలంగా స్పందించి త్వరలో నిర్ణయం చెప్పనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు సుబ్రహ్మణ్యం, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ రవికుమార్

పుంగనూరు రూరల్, జూలై18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలను గుర్తించి వారిని ఆర్థికాభివృద్ధి చేయడమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని జిల్లా డ్వామా, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రవికుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పుంగనూరు, చౌడేపల్లె మండలాల పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో దారిద్రరేఖకు దిగువ ఉన్న కుటుంబాలను గుర్తించాలన్నారు. ఈ నెల 25తేదీ వరకు ప్రతి రోజూ మూడు పంచాతీల చొప్పున అధికారులు గ్రామాల్లో పర్యటించి గుర్తించిన కుటుంబసభ్యులతో చర్చించి వారిని అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాము, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో లీలామాధవి పాల్గొన్నారు.

సోమల: ఉపాధి పనులు జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి రైతులకు కల్పించాలని డ్వామా పీడీ రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఏపీవో షౌకత్, జేఈ నాగమణి, సీవోలు రిజ్వాన్, మోహన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్ర పరిసరాలతోనే ఆరోగ్యం



కుప్పంలో పరిసరాల ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరిస్తున్న మున్సిపల్ వైద్య సిబ్బంది

కుప్పం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన పరిసరాలలో జీవిస్తేనే ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారులు, సిబ్బంది తెలిపారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య సిబ్బంది పరిసరాలను శుభ్రపరచి, మురుగు కాలువల్లో పూడిక తీశారు. మొలాథిన్ ఆయిల్ స్ప్రే చేశారు. వైద్యాధికారులు, సిబ్బంది ఆయా వీధులకు, మురికివాడలకు వెళ్లి పరిసరాల శుభ్రత గురించి ప్రజలకు వివరించారు. అలాగే కుప్పం మండలం ఎన్.కొత్తపల్లె ఆరోగ్య కేంద్రంలో డెంగీ మాసోత్సవాన్ని పురస్కరించుకుని వేపనపల్లె గ్రామంలో ఫ్రై డే డ్రై డే పాటించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సుభాష్ రాజా, వైద్య సిబ్బంది ముత్తుకుమార్, విష్ణుప్రియ, శివగామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నమల్లయ్య తాత ఆలయంలో కుంభాభిషేకం

సోమల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కరకమంద చెన్నమల్లయ్య తాత ఆలయ వార్షిక బ్రహ్మోత్సవం సందర్భంగా శుక్రవారం కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు సుబ్రహ్మణ్యం శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తివాచనం, కలశస్థాపన, దీక్షాహోమం, గణపతి హోమం, అష్టోత్త శత దీపాలంకరణ, తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్య క్రమాల్లో నడింపల్లె, సోమల, కరకమంద, సూరయ్యగారిపల్లె, చెన్నయ్యగారిపల్లె తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉభయదారులు మూలింటి నారాయణ, గజ్జెల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ క్రమంలోనే ఆలయానికి నూతనంగా పోతురాజు, అశ్వవాహనాలను (గుర్రపు వాహనం) దాతలు ఆకా గురుశంకర్, ఏ. ఉమాశంకర్‌రెడ్డి అందజేశారు. శనివారం అభిషేకాలు, అర్చన, నవగ్రహ ఆరాధన, మూల మంత్ర జపాలు, హోమాది కార్యక్రమాలు జరగనున్నాయి.

నేడు ఎల్లమ్మ కొలుపు ఉత్సవాలు

ఎల్లమ్మదేవత కొలుపు ఉత్సవాలు సందర్భంగా శనివారం అమ్మవారి ఆయుధాలకు గంగస్నానం, ఊరేగింపు నిర్వహించనున్నారు.

సీఎం చంద్రబాబుతోనే మహిళలకు న్యాయం



సుజాతను సత్కరిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ప్రభుత్వంలో మహిళలకు సముచిత న్యాయం జరుగుతోందని టీడీపీ పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం రొంపిచెర్ల మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఎంపికైన బీజేపీ కార్యకర్త కొండా సుజాతతో పాటు పలువురు బీజేపీ నాయకులు చల్లా రామ చంద్రారెడ్డి ఇంటికి వచ్చారు. ఆయనకు శాలువ కప్పి, పూల మాలవేసి సత్కరించారు. సుజాతను చల్లారామచంద్రారెడ్డి సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ యువమోర్చ ఉపాధ్యక్షుడు మాదాస్ లోకేష్, రొంపిచెర్ల బీజేపీ మండల అధ్యక్షుడు గెరిగి నాగరాజ, జిల్లా ప్రధాన కార్యదర్శి ముచ్చింతల వెంకట్రామ నాయుడు, బీజేపీ మండల కార్యదర్శి వి.సుధాకరనాయుడు, నాయకులు అబ్బారెడ్డి వెంకట్రామా నాయుడు, ఎస్.ఖాదర్‌బాషా, యర్రయ్య, శేషాద్రినాయుడు, వాసు, బావాజీ పాల్గొన్నారు.

దాడిపై పోలీసులకు ఫిర్యాదు



గాయపడిన శంకర్

పుంగనూరు రూరల్, జూలై18 (ఆంధ్రజ్యోతి): దాడి చేసి గాయపరిచారంటూ ఓ వ్యక్తి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని కథనం మేరకు.. మండలంలోని మాగాండ్లపల్లె పంచాయతీ పెద్దబర్నేపల్లెకు చెందిన శంకర్, చంద్రశేఖర్ ఓ ప్రైవేటు కంపెనీలో ఇద్దరూ రెండు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. ఒకరికి ఒకరు జామీను ఉండి తీసుకున్నారు. శంకర్ తన ట్రాక్టర్‌పై తీసుకున్న లోను డబ్బు మొత్తాన్ని ఫైనాన్స్ కంపెనీకి చెల్లించాడు. రికార్డులు ఇవ్వాలని కోరాడు. అయితే చంద్రశేఖర్ తీసుకున్న అప్పు చెల్లిస్తేనే ట్రాక్టర్ రికార్డులు ఇస్తామని ఫైనాన్స్ కంపెనీ వారు స్పష్టం చేశారు. దీంతో శంకర్ వెళ్లి చంద్రశేఖర్‌తో మాట్లాడాడు. ఫైనాన్స్ కంపెనీకి చెల్లించాల్సిన డబ్బు చెల్లించాలని కోరాడు. ఆగ్రహించిన చంద్రశేఖర్ కట్టెతో శంకర్‌పై దాడి చేశాడు. శంకర్‌ను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ సుబ్బరాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షయ నిర్మూలనకు సమష్టి కృషి అవసరం



క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డీఎల్‌టీవో అధికారి డాక్టర్ వెంకటప్రసాద్

పలమనేరు,జూలై18 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధి సమగ్రంగా నిర్మూలించేందుకు అందరూ సమష్టిగా కృషిచేయాలని డీఎల్‌టీవో డాక్టర్ వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఇక్కడ జరిగిన క్షయవ్యాధి అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. తరచూ తగ్గని దగ్గు, జ్వరం, రాత్రి చమటలు పట్టడం, దగ్గితే రక్తం పడటం, ఛాతీనొప్పి, శ్వాస ఆడకపోవడం, బరువుతగ్గడం, ఆకలి లేకపోవడం, అలసట, మెడలో వాపు రావడం లక్షణాలుగా గుర్తించాలన్నారు. ముఖ్యంగా కీళ్లనొప్పి, వెన్నునొప్పి, తలనొప్పి, ఆందోళన చెందడం కూడా ఈ వ్యాధి లక్షణాలని వివరించారు. 60 ఏళ్లు ఉన్నవారు, పోషకాహారలోపం ఉన్నవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, హెచ్‌ఐవి బాధితులు, ధూమపానం, మద్యపానం చేసేవారు పాత టీబీరోగులకు తప్పనిసరిగా క్షయవ్యాధి పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు. ఈ సదస్సులో వైద్యధికారిణి అలొకి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు, సీహెచ్ఓ విజయకుమారి, ఎంపీహెచ్ఎస్ మధు పాల్గొన్నారు.



నవధాన్యాల అలంకరణలో విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు రూరల్, జూలై18(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం నవధాన్యాల అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనానికి అనుమతించారు. మహిళలు ఉపవాసాలతో ఆమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికలు సమర్పించారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, జూలై18(ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు జరిపించారు. ఆలయ నిర్వాహకులు వినోద్ కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సూరయ్యగారిపల్లె విద్యార్థుల ప్రతిభ



సోమల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం సూరయ్యగారిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈనెల 11, 12 తేదీల్లో నరసారావుపేటలో రాష్ట్రస్థాయిలో జరిగిన 1200 మీటర్ల పరుగు పందెంలో విశేష ప్రతిభ కనబరచి బంగారు, కాంస్య పతకాలు సాధించినట్లు హెచ్ఎం. శిరీష తెలిపారు. 9వ తరగతి విద్యార్థిని మధుప్రియ బంగారు పతకాన్ని, 8వ తరగతి విద్యార్థి దినేశ్ కాంస్య పతకాన్ని సాధించారని వెల్లడించారు. పీడీ శివకుమార్‌ను, విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు.

లారీ బోల్తా..తప్పిన ప్రమాదం

రొంపిచెర్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నెల్లూరుకు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి తిరుపతి-మదనపల్లి జాతీయ రహదారిలో రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లు సమీపంలో అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తా పడింది. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. లారీ డ్రైవర్ వెంకట్రమణ సురక్షితంగా బయటపడ్డాడు.

పేదల కలల సాకారమే లక్ష్యం

వి.కోట, జూలై 18(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కలల సాకారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు అన్నారు. వి.కోట మండలం పెద్దబరిణేపల్లె, వి.కోట, బోడిగుట్టపల్లె పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటా కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శబరీష్, జనార్ధన్‌రెడ్డి, రాము, కోదండ, మనోహర్, నరేంద్ర, చక్రవర్తి, జయకృష్ణ, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, సతీష్, విశ్వనాథ్, కలమ్‌రాజు, వెంకట్రామ, బాలరాజ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



అమ్మవారిని ఆలయంలోకి తీసుకెళుతున్న గ్రామస్తులు

రొంపిచెర్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ గుట్టకిందహరిజనవాడలోని పెద్దమాపూరి యల్లమ్మ, గుర్రప్ప స్వామి ఆలయాలలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు విశిష్ఠ పూజా కార్యక్రమాలు జరుగుతాయని గ్రామ స్తులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం అమ్మవారి ఉత్సవిగ్రహాన్ని ఆలయానికి గ్రామస్తులు పండితుల మంత్రోచ్చరణల నడుమ తీసుకొచ్చారు. పూజలకు నాగరాజ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు.

సారా కేసులో 9 మంది బైండోవర్

కుప్పం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గతంలో నమోదు చేసిన ఒక సారా కేసులో పోలీసులు 9 మంది నిందితులను బైండోవర్ చేశారు. కుప్పం, రామకుప్పం మండలాల పరిధిలోని తమిళనాడు సరిహద్దు గ్రామాలైన దేవరాజపురం, ఆరమానుపెంట గ్రామాలకు చెందిన వారిపై తమిళనాడులోని తిమ్మంపేట, వాణియంబాడి పోలీసు స్టేషన్లలో గతంలో సారా కేసులు నమోయ్యాయి. ఈ కేసులకు సంబంధించి దేవరాజపురం గ్రామానికి చెందిన ఏలుమలై, తంగం, ముత్తు, రామలింగం, అమ్ములు, తిరుమలై, మోహన, కార్తీలను ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

టీడీపీతోనే యువత భవితకు భరోసా

● ఎమ్మెల్యే భానుప్రకాష్


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీతోనే యువత భవితకు భరోసా ఉంటుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. నగరిలోని సూర్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి 15 కంపెనీలు జాబ్‌మేళా నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు ప్రతి నియోజకవర్గంలో మూడు నెలలకోసారి జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో సుమారు 400 మంది హాజరయ్యారు. 153 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. డీఎస్‌డీవో గుణశేఖర్‌రెడ్డి, ఏపీఎస్ ఎస్‌డీసీ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య, ప్రతాపరాజు, జయరామరాజు, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి నష్టం కల్గించడానికే జగన్‌రెడ్డి కుట్ర: టీడీపీ


దివ్యాంగురాలికి కరపత్రాన్ని అందజేస్తున్న టీడీపీ నేతలు

గంగాధరనెల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి నష్టం కల్గించడానికే మాజీ సీఎం జగన్‌రెడ్డి కుట్ర చేస్తున్నాడని టీడీపీ నాయకులు ఆరోపించారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా తూగుండ్రం, బంగారెడ్డిపల్లె పంచాయతీల్లోని పలుగ్రామాల్లో టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షులు నీరజాక్షులురెడ్డి, రామచంద్రనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగు యువత మాజీ కార్యనిర్వాహక జిల్లా కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్ తదితరులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. నేతలు నరసింహులునాయుడు, నియాజ్‌అలీ, జీవరత్నం, హరీష్‌యాదవ్, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో వసతులపై అధికారుల ఆరా

పెనుమూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పాళ్యంయానాది (ఎస్టీ) కాలనీలో వసతులపై అధికారులు ఆరా తీస్తున్నారు. జేసీ ఆదేశాలతో ఎస్టీకాలనీల్లోని ప్రజలకు నిత్యావసరాలు అందుతున్నాయా? తాగునీరు, రోడ్లు, ఇళ్లు, విద్యుత్ వంటి వసతులు ఉన్నాయా? అని శుక్రవారం సర్వే చేపట్టారు. స్థానికులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, సెక్రటరీ జ్యోతీశ్వర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు కోసం స్థల పరిశీలన


బొమ్మసముద్రం క్రాస్‌లో అధికారులు

గుడిపాల, జూలై 18(ఆంధ్రజ్యోతి): బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిపై 190 రామాపురం సీఎంసీ నుంచి నరహరిపేట క్రాస్ వరకు సర్వీసు రోడ్డు లేక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలామంది మృతి చెందడంతో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో సర్వీసు రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం చీలాపల్లెక్రాస్ నుంచి నరహరిపేట వరకు రవాణాశాఖ అధికారులు నరసింహులు,మురళి, కుసుమ, ఎస్ఐ రామ్మోహన్, ఎన్‌హెచ్ఏ అధికారి రామచంద్రలు స్థల పరిశీలన చేశారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నారు.

విద్యాసామగ్రి వితరణ



విజయపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులకు శుక్రవారం శ్రీసరస్వతి మాత సాంఘిక సేవా సమాజం సహకారంతో పలకలు, రాతపుస్తకాలు, బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు వితరణ చేశారు. అలాగే మధ్యాహ్న భోజనానికి అవసరమైన ప్లేట్లు, గ్లాసులు కూడా అందజేశారు. రిటైర్డు ఎంఈవో యుగంధర్‌రాజు, హెచ్‌ఎం వెంకమరాజు, నెహ్రూ సేవా సంఘ అధ్యక్షులు జ్యోతిలక్ష్మి, విద్యాకమిటీ చైర్మన్ చిన్నపాపయ్య, టీచర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నింద్ర మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ కార్యవర్గం


వెంకటేశులు - సతీష్

నింద్ర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నింద్ర మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా కొప్పేడు కార్యదర్శి ఎస్.వెంకటేశులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో నూతన కార్యవర్గం ఎన్నిక ఎంపీడీవో శివప్రసాద్ వర్మ అధ్యక్షతన జరిగింది. ఉపాధ్యక్షులుగా తనూజ్‌కుమార్ (కావనూరు), అరవింద్ (ఇరుగువాయి), మోహన్‌బాబు (ఓరూరుపేట), ప్రధాన కార్యదర్శిగా సతీష్ (నెట్టేరి), సంయుక్త కార్యదర్శిగా రాజేష్ (చవరంబాకం), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మురళీకృష్ణ (ఎలకాటూరు), కోశాధికారిగా బాలాజి (ఆరూరు)తోపాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సన్మానం



బాలాజీని సన్మానిస్తున్న చినబాబు- వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

నగరి/నింద్ర, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగరి పీఏసీఎస్ చైర్మన్‌గా నియమితులైన బాలాజీని చిత్తూరు పార్లమెంటరీ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, నగరి మండల పార్టీ అధ్యక్షుడు జవహర్‌రెడ్డిలు శుక్రవారం సన్మానించారు. ● నింద్ర పీఏసీఎస్ చైర్మన్‌గా నియమితులైన వెంకటేశ్వరరావును వెలుగు కార్యాలయంలో సన్మానించారు. ఏపీఎం పళని, సభ్యులు ఇందుమతి, భవాని, సీసీలు భాస్కర్, గిరి, లక్ష్మయ్య, సంఘమిత్రలు రాజశ్వరి, శరణ్య, అమృత తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల అభివృద్ధే ధ్యేయం


మీడియాతో మాట్లాడుతున్న ఎల్బీఐ లోకేష్ రెడ్డి

పూతలపట్టు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల అభివృద్ధే ధ్యేయంగా అభయసాయి ట్రస్టును ఏర్పాటుచేయడం జరిగిందని ట్రస్టు డైరెక్టర్, టీడీపీ నేత ఎల్బీఐ లోకేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ ట్రస్టు ద్వారా 2004 నుంచి ఏటా సాయిబాబా భక్తులను షిరిడీకి తీసుకెళ్తున్నామన్నారు. ఆదివారం ఉదయం 500 మందిని తమ సొంత నిధులతో షిరిడీకి తీసుకెళ్తున్నామన్నారు. యాత్రకు విచ్చేసే మహిళలు, వృద్ధులకు వైద్య సదుపాయం కూడా ఏర్పాటు చేశామన్నారు. టీడీపీ నేతలు కృష్ణమూర్తి, మణి పాల్గొన్నారు.

అటెండర్, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయండి


జడ్పీ సీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న వినాయకం తదితరులు

చిత్తూరు రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జడ్పీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కోరారు. ఈ మేరకు శుక్రవారం జడ్పీ కార్యాలయంలో సీఈవో రవికుమార్ నాయుడికి వినతిపత్రం ఇచ్చారు. జడ్పీలో పీఎఫ్‌కి సంబంధించి ఇబ్బందులను పరిష్కరించడానికి వారం రోజులపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. కారుణ్య నియామకాలను నెలవారీగా సమీక్షించి పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు మురళి, రామ్మూర్తి, సుబ్రహ్మణ్యం, మహేష్, షణ్ముగం, అరుణ్‌కుమార్, దేవరాజులు, కుమార్, చలపతి పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులపై దృష్టి పెట్టండి

● ఆశా కార్యకర్తలకు డీఐవో ఆదేశం


సమావేశంలో ప్రసంగిస్తున్న డీఐవో హనుమంతరావు

చిత్తూరు రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): 'హైరిస్క్ గర్భిణులపై దృష్టి పెట్టాలి. కాన్పుకు వారం ముందు వారిని ఆస్పత్రిలో చేర్పించి సుఖ ప్రసవం అయ్యేలా చూడాలి' అని డీఐవో హనుమంతరావు ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆశా కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. మాతా శిశు సంరక్షణ విషయంలో రాజీపడొద్దన్నారు. గర్భిణీగా నమోదైన ప్రతి ఒక్కరినీ వెయ్యిరోజులపాటు పరీక్షిస్తూ.. ప్రతి వైద్యసేవా అందించాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : థామస్


మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే థామస్

పెనుమూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎమ్మెల్యే థామస్ అన్నారు. శుక్రవారం సీఆర్‌కండ్రిగ పంచాయతీలోని బండమీదఊరు, ఏఏడబ్ల్యూలో ఆయన పర్యటించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ప్రతీ ఇంటికీ వెళ్లి ఏడాది ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పులికల్లు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, ప్రధానకార్యదర్శి భాస్కర్, ఉపాధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, యువత అధ్యక్షుడు చిరంజీవిరెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి, కృష్ణమూర్తినాయుడు, సతీష్‌రెడ్డి, యువరాజులునాయుడు, ఎస్ఎస్‌నాయుడు, హేమాద్రినాయుడు, అశోక్, గుర్రప్పనాయుడు, సురేష్, షణ్ముగవర్మ, గోపాల్‌నాయుడు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై కోదండరాముడి చిద్విలాసం



తవణంపల్లె, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టి.పుత్తూరు కోదండరామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు కల్పవృక్షవాహనంపై విహరించారు. ఉదయం స్వామివారికి తిరుమంజనం, క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవర్లకు ఊంజల్‌సేవ నిర్వహించి.. కల్పవృక్ష వాహనంపై అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, ఉభయదారులు, టి.పుత్తూరు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం: మురళీమోహన్


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శుక్రవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా మండలంలోని వైఎస్ గేటు, కామినాయనపల్లె, కామినాయనపల్లె ఎస్సీ కాలనీ, కుల్లంపల్లె, కస్తూరినాయనపల్లె, రత్నగిరి, చినవెంకటంపల్లె, మట్టపల్లె, చింతగుంపలపల్లె గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేస్తూ.. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గంగారపు హరిబాబునాయుడు, పూతలపట్టు పోల్ మేనేజ్‌మెంట్ అధ్యక్షుడు వడ్లపాటి గిరిధర్‌బాబు, జడ్పీటీసీ సుచిత్ర, మాజీ జడ్పీటీసీ లత, వరసిద్ధుడి ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, మేదరమిట్టమోహన్ నాయుడు, మధుసూదనరావు, చిన్నబ్బనాయుడు, గోవిందనాయుడు, శేషాద్రినాయుడు, నాగేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలర్స్ డే



వెదురుకుప్పం, జూలై 18(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం లక్ష్మీనరసింహా పాఠశాలలో శుక్రవారం కలర్స్ డేని ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ దిలీప్‌కుమార్, హెచ్‌ఎం హేమలత, డైరెక్టర్లు ధనంజయరెడ్డి, పురుషోత్తం, వెంకటేష్, ఉపాధ్యాయులు సౌమ్య, మమత, లీలావతి, విద్య, హంస పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం



నగరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డిని నగరి పీఏసీఎస్ చైర్మన్‌గా నియమితులైన బాలాజీ, డైరెక్టర్ జవహర్‌రెడ్డి, సీఈవో తులసిపిళ్లై శుక్రవారం సన్మానించారు. నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారానికి రావాలని డీసీసీబీ చైర్మన్, సీఈవో శంకర్‌బాబు, జనరల్ మేనేజర్ మనోహర్‌గౌడ్‌ను ఆహ్వానించారు.

ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

గంగాధరనెల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ హరిప్రసాద్‌రెడ్డి సూచించారు. గంగాధరనెల్లూరు ఎంపీడీవో ఆఫీస్‌లో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల నిర్వహణ, తాగునీటి సమస్యలు, సమాచారహక్కు చట్టంపై పంచాయతీకార్యదర్శులకు అవగాహన సమావేశం నిర్వహించారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

బంగారుపాళ్యం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులతో దీనిపై శిక్షణ కార్యక్రమం జరిగింది. జూనియర్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గిరిబాబు, హెచ్‌ఎం గిరిరాజు పాల్గొన్నారు.

పీ4 కార్యక్రమంపై సమావేశం

వెదురుకుప్పం, జూలై 18(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ఎంపీడీవో సమావేశపు మందిరంలో శుక్రవారం పంచాయతీల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు పీ4 కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో పురుషోత్తం, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో అత్తూరు కోదండరామిరెడ్డి, పీ4 ప్రోగ్రాం శిక్షకురాలు మాధురి పాల్గొన్నారు. కాగా, పచ్చికాపల్లంలో చెత్త సేకరణ పనులను ఎంపీడీవో తనిఖీ చేశారు. గ్రామ కార్యదర్శి వెంకటేశులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీవానదిలో పగటిపూటే ఇసుకను తీసుకెళ్లాలి: సీఐ

గంగాధరనెల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నీవానది ఏటి ప్రాంతంలో పగటిపూట మాత్రమే ట్రాక్టర్ నిర్వాహకులు ఇసుకను తీసుకెళ్లాలని సీఐ శ్రీనివాసంతి తెలిపారు. గురువారం రాత్రి ఏటి నుంచి మూడు ట్రాక్టర్లలో ఇసుకను తీసుకెళుతుండగా పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని, నిర్వాహకులపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఈ ట్రాక్టర్ల విషయంగా రెవెన్యూ అధికారులకు తదుపరి చర్యలపై నివేదికలను పంపించామన్నారు.

సింగిల్‌విండోలో ఎరువుల స్టాక్ తనిఖీ



గంగాధరనెల్లూరు, జూలై18 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు సింగిల్‌విండో సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ వెంకటరవి, తిరుపతి జిల్లా వ్యవసాయశాఖ ఏడీ ధనంజయరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. సింగిల్‌విండో గోడౌన్‌లో స్టాక్ ఉన్న 352 బ్యాగ్‌ల కాంప్లెక్స్‌ను, 370 బ్యాగ్‌ల డీఏపీని తనిఖీచేసి, రికార్డులను, బిల్లు బుక్‌లను పరిశీలించారు. ఏవో భవాని, సింగిల్‌విండో సీఈవో విజయకుమార్‌రెడ్డి, సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డీపీఈ ఈఈగా హరి బాధ్యతల స్వీకరణ



చిత్తూరు రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో విద్యుత్ చౌర్య నివారణ (డీపీఈ) విభాగ ఈఈగా హరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో ఉన్న షణ్ముగం ఇటీవల రిటైరయ్యారు. దాంతో ఆదోని డివిజన్ ఈఈగా ఉన్న హరిని ఇక్కడికి బదిలీ చేశారు.

9నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

నగరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగరిలో వచ్చేనెల 9, 10, 11 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ప్రధాన కార్యదర్శి కోదండయ్య పిలుపునిచ్చారు. సీపీఐ వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నగరిలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేలన్,నాగరాజు, బాషా, మురళి పాల్గొన్నారు.

వజ్రాలపురం గంగమ్మ ఆలయ ధర్మకర్త మృతి


రాధమ్మ (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బొమ్మాయిపల్లె పంచాయతీ వజ్రాలపురంలోని బోయకొండ గంగమ్మ ఆలయ ధర్మకర్త రాధమ్మ(81) శుక్రవారం అనారోగ్య సమస్యలతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈమె కొంతకాలంగా బెంగళూరులో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. అంత్యక్రియలు స్వగ్రామమైన బొమ్మాయిపల్లెలో శనివారం జరుగుతాయన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆడిమాస పూజలు


దుర్గాంబ ఆలయంలో గోపూజ

చిత్తూరు కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయంలో ఆడిమాస తొలి శుక్రవార పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అలాగే శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర, గుర్రప్పనాయుడువీధి అంకాల పరమేశ్వరి, కామాక్షి సమేత అగస్త్యేశ్వర తదితర ఆలయాల్లోనూ భక్తులు పూజలు చేశారు.

ఇందిరానగర్‌లో తాగునీటి సమస్య

పాలసముద్రం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణజిమ్మాపురం పంచాయతీ ఇందిరానగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని శుక్రవారం ఎంపీడీవో సతీష్‌ను కలసి గ్రామస్థులు విన్నవించారు. నెల రోజులుగా గ్రామంలోని తాగునీటి బోరు నుంచి చాలినన్ని నీళ్లు రావడం లేదన్నారు. కొత్త బోరు వేసి సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీవోతోపాటు కార్యదర్శి జయశంకర్ తెలిపారు.

సంక్షిప్తంగా..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బంగారుపాళ్యం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక సమస్యలను పరిష్కరించనున్న నేపథ్యంలో బంగారుపాళ్యం మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దేవీప్రసన్న తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు పనిముట్ల పంపిణీ

నగరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగరి ఓంశక్తి ఆలయ వార్షికోత్సవం, ఆడిమాస ఉత్సవాల సందర్భంగా నిరుపేదలకు పనిముట్లను, రైతులకు స్ప్రేయర్లను శుక్రవారం ఎమ్మెల్యే భానుప్రకాష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. జిల్లా ఓంశక్తి భక్తుల సంఘం అధ్యక్షుడు గంగాధరం, ఉమాపతి, వెంకటరమణ, గుణశేఖర్, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల్లో అర్హులను గుర్తించాలి: ఎంపీడీవో

పాలసముద్రం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 574 మంది బంగారు కుటుంబాల జాబితాలో అర్హులను గుర్తించాలని ఎంపీడీవో సతీష్ ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ఎన్‌ఆర్‌ఐలు, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు.

ఎస్ఐను కలిసిన టీడీపీ నేతలు

విజయపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విజయపురం నూతన ఎస్ఐ మహేష్‌బాబును శుక్రవారం టీడీపీ మండల నాయకులు మర్యాదపూరకంగా కలిసి, సన్మానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్ రాజు, జీఎంపురం గ్రామకమిటీ అధ్యక్షుడు బాలాజీనాయుడు, నాయకులు అశోక్, గాలి మురళి, ఆల్బర్ట్ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో తనిఖీలు

వెదురుకుప్పం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం భవిత కేంద్రాన్ని సహిత విద్య జిల్లా సమన్వయకర్త మధు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయనవెంట ఏఎస్‌వో బాషా, సహిత ఉపాధ్యాయులు సింధుజ, రేఖ పాల్గొన్నారు.

మంగళగౌరీ వత్రం

చిత్తూరు కల్చరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పొన్నియమ్మ గుడిలో 101 మహిళలు మంగళ గౌరీ వ్రతం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ సీకే లావణ్యఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో అర్చకుడు కేదారేశ్వరన్ పాల్గొన్నారు.

థామస్‌ను కలిసిన కృష్ణమనాయుడు



గంగాధరనెల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన పాతపాళ్యం పంచాయతీ మిట్టకొత్తూరుకు చెందిన ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు శుక్రవారం రాత్రి తిరుపతిలోని బ్లిస్ హోటల్లో ప్రభుత్వ విప్ థామస్‌ను కలిశారు. ఈ సందర్భంగా థామస్‌ను సన్మానించారు. టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, నేతలు హరీష్‌యాదవ్, వరదరాజులు, వెంకటేష్ యాదవ్, కుప్పయ్య పాల్గొన్నారు.

భార్య కత్తితో దాడి: ఆస్పత్రి పాలైన వృద్ధుడు


గాయపడ్డ జయవేల్

వెదురుకుప్పం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భార్య కత్తితో దాడి చేయడంతో ఓ వృద్ధుడు ఆస్పత్రి పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కార్వేటినగరం మండలం కొల్లాగుంట గ్రామానికి చెందిన పి.జయవేల్(70), రాజేశ్వరి దంపతులు. వీరి మధ్య ఆస్తి విషయమై గొడవలు ఉన్నాయి. శుక్రవారం ఉదయం ఒంటరిగా నిద్రిస్తున్న జయవేల్‌పై అతడి భార్య రాజేశ్వరి.. ఆమె బంధువుల ప్రోద్బలంతో కత్తితో దాడి చేసింది. ఈ క్రమంలో జయవేల్ గాయపడ్డాడు. బాధితుడిని తొలుత సీహెచ్‌సీకి తరలించి, అక్కడి నుంచి తిరుపతి రుయాస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై వీరి కుమార్తె సంగీత ఇచ్చిన ఫిర్యాదుతో రాజేశ్వరి సహా మంజుల శక్తివేల్, లీలఅంబికపై కేసు నమోదు చేశారు.




చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తల్లి లక్ష్మీభారతి భౌతిక కాయం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నేతలు చంద్రప్రకాశ్, చిట్టిబాబు, సీకే లావణ్య తదితరులు